ఊరించారు.. ఉసూరుమనిపించారు

- తల్లికి వందనం అమల్లో కొర్రీ
- దక్షిణలో సచివాలయాలు 68
- లబ్ధిదారులు 33 వేలుగా అంచనా
- 24 వేల మందే అర్హులుగా జాబితా
- 9600 మంది అనర్హులుగా నిర్ధారణ
- సచివాలయాలకు క్యూ కడుతున్న తల్లులు

దాబాగార్డెన్స్: ఎన్నికల ముందు ఆహో.. ఓహో అన్నారు. అమలు కాని ఎన్నో హామీలిచ్చారు. సూపర్ సిక్స్ అన్నారు. ఇంకేదేదో అన్నారు. కానీ అమలు విషయంలో మాత్రం ఎలాంటి ప్రగతి కానరావడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదు. ఏడాది సంబరాలు చేసుకునే సమయం వచ్చింది. ప్రజలకు ఏదో చూపించాలన్న ఉద్దేశంతో అది చేశాం.. ఇది చేశాం.. ఇచ్చిన హామీల్లో 70 శాతం అమలు చేసేసామన్న మాటలే తప్ప చేతల్లే ఏమీ కనిపించడంలేదు.


తాజాగా కూటమి ప్రభుత్వం ప్రజల్లో తన ప్రభావం చూపించుకునేందుకు ముందుగా తల్లికి వందనం ఇస్తామని నెల రోజులుగా హడావిడి చేసింది. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, తాజాగా నిబంధనల పేరిట లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత విధించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నెల 12వ తేదీ నుంచే డబ్బులు జమ అవుతాయని పత్రికా ప్రకటనలు రావడంతో బ్యాంకుల వద్ద పడిగాపులు పడిన తల్లులు డబ్బులు జమ కాకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దక్షిణ నియోజకవర్గంలో 33 వేల మంది తల్లులు అర్హులుగా ఉన్నప్పటికీ 24 వేల మంది మాత్రమే అర్హులుగా ప్రకటిస్తూ జాబితా విడుదల చేశారు. మిగిలిన వారు అనర్హులుగా.. ఎటువంటి వివరణ లేకుండా తేల్చి పడేశారు.


జీవీఎంసీ పాఠశాల పిల్లలు

గతంలో తీసుకున్న వారికి కూడా..

గతంలో 'అమ్మ ఒడి' తీసుకున్న లబ్ధిదారులు సైతం ఈ జాబితాలో అనర్హులుగా తేలడం గమనార్హం. దీనిపై సచివాయంలో ఆరా తీయగా, వేయి చదరపు అడుగుల కంటే ఎక్కువ ఆస్తి ఉన్నట్లు లేదా రూ.12 వేల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నట్లు చూపుతూ అనర్హులుగా తేల్చినట్టు చెబుతున్నారు. వాస్తవానికి, అనర్హుల్లో అత్యధిక శాతం మందికి ఆస్తులు లేనప్పటికీ ఉన్నట్టు చూపుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆస్తుల్లేవని, అద్దె ఇంట్లో ఉన్నామని చెబుతున్నప్పటికీ సచివాలయ సిబ్బంది తమకు సంబంధం లేదని జీవీఎంసీ కార్యాలయానికి వెళ్లాలంటూ తిప్పుతున్నారని పలువురు తల్లులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే, మ్యాపింగ్ చేపట్టినప్పుడు, అద్దెకున్న వారి ఆధార్ కార్డును ఇంటి ఆస్తి పన్నుతో లింక్ చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని తెలుస్తోంది.

లక్ష మందికి పైగా అనర్హులుగా నిర్ణయించారు..



ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి లక్ష మందికి పైగా అనర్హులను చేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం హడావిడిగా ప్రారంభించి, లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత విధించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 1,70,457 మందికి అమ్మ ఒడి వచ్చింది. ఇప్పుడు జిల్లాలో మూడు లక్షల నుంచి మూడున్నర లక్షల మందికి లబ్ధి చేరుతుందని భావించారు. రూ.12 వేల జీతం దాటిన వారికి, 300 యూనిట్ల కరెంటు బిల్లులు వచ్చిన వారికి, ఆస్తులు లేని వారికి ఆస్తులు ఉన్నట్టుగా చూపించి, అర్హులైన లక్ష మందికి పైగా విద్యార్థులకు కోత విధించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పథకాల నగదు నేరుగా ప్రజల ఖాతాల్లో పడేవి. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు హామీలు అమలు చేయలేక అర్హులైన పేదవారి ఉసురు పోసుకుంటున్నారు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

తల్లికి వందనం రాని వాళ్లకి..

తల్లికి వందనం రాని వాళ్లకి తాజాగా గ్రామ/సచివాలయంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఏ కారణం చేత ఎందుకు రిజెక్ట్ అయిందో తెలుసుకుని సరైన ఆధారాలు జోడించాలని పేర్కొంటున్నారు. అలాగే కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల నకళ్లు జత చేసి మళ్లీ దరఖాస్తు చేయాలని సిబ్బంది చెబుతున్నారు.


సచివాలయ సిబ్బందితో తల్లికి వందనం నిధులు పడకపోవడంపై వివరాలు అడుగుతున్న తల్లులు

ఎందుకు పడలేదో తెలియడంలేదు..

గత ప్రభుత్వంలో జమయ్యాయి.. ఇప్పుడు రాలేదు. మాకు ఎటువంటి ఆస్తులు లేవు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. చాలీ చాలని ఆదాయం. పిల్లల్ని చదివించుకోవడం కష్టమైనప్పటికీ అప్పులు చేసి చదివిస్తున్నాం. తల్లికి వందనం జమయి ఉంటే ఎంతో కొంత మాకు ఉపశమనం కలిగేది. కానీ ఈ ఏడాది ఎందుకు పడలేదో తెలియడం లేదు.

– జి.నాని, స్థానికుడు, మహారాణిపేట

ఒక్కరికి కూడా పడలేదు..

నాకు ఇద్దరు పిల్లలు. ఒకటో తరగతి చదువుతున్నారు. ఇద్దరికీ రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు పడతాయని ఆశ పడ్డాను. బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేశా. ఇద్దరికి కాదు కదా.. కనీసం ఒక్కరికి కూడా డబ్బులు పడలేదు. కారణం తెలుసుకుందామని సచివాలయానికి వెళ్తే మరలా దరఖాస్తు చేసుకోమంటున్నారు.

– నాగమణి, స్థానికురాలు, మహారాణిపేట

వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుల నియామకం



అల్లిపురం: పార్టీ బలోపేతానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి దక్షిణ నియోజకవర్గం వార్డు అధ్యక్షులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వార్డు	అధ్యక్షుడు
27	నీలాపు సర్వేశ్వరరెడ్డి
29	పీతల శ్రీనివాస్
30	దశమంతుల మాణిక్యాలరావు
31	బాపూ ఆనంద్
32	రాజారెడ్డి
34	తోట పద్మావతి
35	అలపన కనకరెడ్డి
36	మహ్మద్ షఖీల్
37	ఆకుల ఏసు
38	గురజాపు రవి
39	ముజీబ్‌ఖాన్
41	కోడిగుడ్ల శ్రీధర్

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు అవగాహన.. కార్మికులకు ఉపాధి





విశాఖ వేదికగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని మోదీ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారంటే.. ఎంత పెద్ద ఈవెంటో అందరికీ తెలిసిందే. అందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ యోగాంధ్ర పేరిట జరగనున్న ఈ కార్యక్రమం కోసం ఎక్కడికక్కడ యోగాసనాలతో కూడిన పెయింటింగ్‌లు ప్రధాన రహదారులు.. మెయిన్ జంక్షన్లలో కనిపించేలా చిత్రీకరిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు యోగాపై అవగాహన కలగడంతో పాటు ఎంతో మంది పెయింటర్లకు పని దొరుకుతోంది.

- దాబాగార్డెన్స్

ప్రకాశరావుపేటలో నాగుపాము పిల్ల కలకలం


నాగుపాము పిల్లను పట్టుకున్న స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి

దాబాగార్డెన్స్: మహారాణిపేట పరిధి ప్రకాశరావుపేటలో పాములు సంచరిస్తున్నాయి. జడ్జి కోర్టుకి ఎదురుగా ఉన్న ప్రకాశరావుపేటలో ఓ ఇంట్లో నాగుపాము పిల్ల కలకలం రేపింది. అమ్మో పాము.. అంటూ ఆ ఇంట్లో ఉన్న వారితో పాటు పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. స్నేక్ సేవర్ సొసైటీ వ్యవస్థాపకుడు రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. దీంతో సొసైటీ ప్రతినిధి వచ్చి పామును పట్టుకున్నారు. ముళ్ల పొదల్లో పలు పాములు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ


బ్యాగులు, యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. పాఠశాలలు తిరిగి తెరుచుకున్న నేపథ్యంలో, ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన విద్యా సామగ్రిని హెచ్‌ఎం సిద్ధార్థ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, పాఠశాలలో ఉన్న 60 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫామ్స్, బ్యాగులు, ఇతర వస్తువులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామికి వార్షిక అభిషేకం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వార్షిక అభిషేక వేడుక వైభవంగా జరిగింది. మూలవిరాట్ శ్రీవల్లి, దేవసేన సహిత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఏకవారాభిషేకం నిర్వహించారు. వీటితో పాటు మండాపారాధన, పంచామృతాభిషేకం అత్యంత శోభాయమానంగా జరిగాయి.

స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా హరనాథ్



మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు ఆయనను అభినందించారు.

మత్తు.. చిత్తు!


మద్యం మత్తులో పూర్ణామార్కెట్ రోడ్డుపై దొర్లుతున్న మందుబాబు


వెంకటేశ్వర థియేటర్ వద్ద మద్యం మత్తులో మందుబాబులు


కొద్ది సేపటి తర్వాత తాగిన మత్తులో దొర్లి కింద పడిన మందుబాబు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. రాష్ట్రాభివృద్ధి ఎలా ఉన్నా.. మద్యం మాత్రం ఏరులై పారుతోంది. వేకువ జాము నుంచే మందుబాబులకు కావాల్సిన మద్యం ఇట్టే దొరుకుతోంది. దీనికి నిదర్శనమే ఇక్కడున్న చిత్రాలు. పూటుగా మద్యం సేవించిన మందుబాబులు వెంకటేశ్వర థియేటర్ ఏరియా, పూర్ణామార్కెట్ వద్ద ఒళ్లు తెలియకుండా దొర్లుతూ కనిపించారు.

- దాబాగార్డెన్స్

ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ఖండించండి

పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో వామపక్ష పార్టీల పిలుపు



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు

టీవీరోడ్డు: పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రజలు ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ విగ్రహం దగ్గర నుండి ఆశీలమెట్ట మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు యుద్ధం వద్దు.. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఊచకోతలను ఖండించండని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను తీవ్రంగా ఖండించారు. 20 మాసాలకు పైగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని గుర్తు చేశారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారన్నారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫ్లోటిల్లాకు చెందిన మాడ్‌లీన్ ఓడపై ఇజ్రాయెల్ జరిపిన దాడిని కూడా వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో సామ్రాజ్యవాద మనుగడ కోసం అమెరికా అనేక దేశాల మధ్య యుద్ధాలు సష్టించి ముందుకు సాగాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయెల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ మారణకాండ, వివక్ష, ఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలని వామపక్షాలు విజ్ఞప్తి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు హెచ్.ఆర్.ఎఫ్. నాయకులు వి.ఎస్.కృష్ణ, సీపీఎం నాయకులు పి.మణి, బొట్టా ఈశ్వరమ్మ, వి.నరేంద్రకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, చంద్రశేఖర్, ఎస్.యు.సి.ఐ.సి. ఎస్.గోవిందరాజులు, ప్రజాపోరు దేవా, నరసింహారావు, వామపక్ష నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ జాతర


పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 54,57 వార్డుల పరిధిలో ఐటీఐ జంక్షన్, సంకురుపేట ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి ప్రధాన జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యుల ప్రత్యేక పూజలతో జాతర ప్రారంభం అయింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. పూజారులు పిల్లి చంద్రశేఖర్, పిల్లి నాగమణి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశి కూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్‌ఏడీ, గోపాలపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. భక్తులు అమ్మవారి మూలవిరాట్‌తో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఘటాలను అమ్మవారి ఆలయం వద్దకు చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఐదవ పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ వేడుకలను గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు మురళి, రమణ, శంకర్, రాము, సూరిబాబు, రామకృష్ణ, నూకరాజు, జగదీష్, బాలు, శ్యామ్ తదితరులు పర్యవేక్షించారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై చర్చ


పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సర వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం మంగళవారం ఏయూలో జరిగింది. ఈ సమావేశంలో ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్. ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిషోర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎం. రావు, బీవీఎస్. రావు వర్చువల్‌గా హాజరయ్యారు. వారు సంఘం భవిష్యత్తు దృక్పథం, కార్యకలాపాలపై వివరణాత్మక వివరణ ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి బీలా సత్యనారాయణ, ఏఏపీ మాజీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు, శంకర్ ఈ సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం దార్శనికత, లక్ష్యం, విలువలను అధికారికంగా రూపొందించారు. అలాగే పూర్వ విద్యార్థుల సంఘం కొత్తగా పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. డిసెంబర్ 2025లో జరగనున్న వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశం ప్రణాళిక అమలుపై కూడా చర్చించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా పాల్గొనేలా అన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ఎంవీపీకాలనీ: పెదజాలరిపేటలోని అంగన్‌వాడీ సెంటర్లలో కొత్తగా చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం పెదజాలరిపేట జీవీఎంసీ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సామూహిక అక్షరాభ్యాసంతో పాటు ఐదేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుందరి, స్కూల్ హెచ్‌ఎం విష్ణుమూర్తినాయుడు, కార్పొరేటర్ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం


రైల్వేస్టేషన్‌లో యోగాసనాలు వేస్తున్న వాల్తేర్ డివిజన్ రైల్వే అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి వాల్తేర్ డివిజన్ సిద్ధమవుతోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే యోగా జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. దైనందిన జీవితంలో యోగా చేయడం వల్ల నరాలకు సత్తువ, మానసిక బలం, సరైన శరీరాకృతి లభించడమే కాకుండా, ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయని వివరించారు. యోగా దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్లలో రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు యోగాసనాలు అభ్యాసం చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, అలాగే 21వ తేదీన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అరకు, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్ వంటి ప్రధాన స్టేషన్లలో ప్రత్యేక యోగా క్యాంపుల ద్వారా యోగాసనాలు నేర్పిస్తున్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ సభ్యులు, నేవీ సిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సీనియర్ యోగా గురువులు వివిధ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానానికి సంబంధించిన చిట్కాలను నేర్పిస్తున్నారన్నారు. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవల్ సర్వీసెస్ విశ్వకర్మ సహకారంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 వేడుకల కోసం సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ గేట్ వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్–2 కె. పవన్ కుమార్‌తో పాటు 100 మంది రైల్వే ఉన్నతాధికారులు, 25 మంది నేవీ ఉన్నతాధికారుల నాయకత్వంలో విభిన్న యోగాసనాలు, ప్రాణాయామం, మెడిటేషన్ చిట్కాలు నేర్చుకున్నారు.

యోగా దినోత్సవానికి ఏయూ విద్యార్థులు సిద్ధం

మద్దిలపాలెం: ఈ నెల 21న విశాఖ వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే సువర్ణావకాశం ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులకు లభించింది. ఈ బృహత్తరమైన కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా పాల్గొంటుండటంతో ఇది మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 5 లక్షల మంది ప్రజలతో రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు నిర్వహించనున్న ఈ యోగా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. గత నెల 21 నుంచే 'యోగాంధ్ర' వేడుకల కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల రోజుల పాటు సాగుతున్న ఈ యోగాంధ్ర కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఏయూ ఉద్యోగులకు సైతం మూడు రోజుల పాటు యోగాపై అవగాహన శిక్షణ తరగతులను నిర్వహించింది. అలాగే ప్రజలకు అవసరమైన మార్గనిర్దేశం చేసేందుకు ఏయూ అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 1200 నుంచి 1500 మంది యువతను సిద్ధం చేస్తున్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, యోగా దినోత్సవానికి అవసరమైన సేవలు అందించడానికి శిక్షకులను తీర్చిదిద్దారు. ప్రజలు యోగాసనాలు వేసే సమయంలో వారికి అవసరమైన సూచనలు అందిస్తూ, అందరూ నిర్దేశించిన యోగాసనాలను సాధన చేసే దిశగా ఏయూ విద్యార్థులు సమన్వయం చేయనున్నారు. బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో రెండు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తమ అనుభవాలను వెల్లడించారు.